## సంక్షేమ పథకాలతో ఇంటింటికీ లబ్ధి



ఎదులాపురం : ఓటు అభ్యర్థిస్తున్న వార్డు ఇన్‌చార్జి రోకండ్ల రమేశ్, కౌన్సిలర్ సంద నర్సింగ్

ఎదులాపురం, నవంబర్ 19 : బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఇంటింటికీ లబ్ధి చేకురుతున్నాయని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు, వార్డు ఇన్‌చార్జి రోకండ్ల రమేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడలో ఇంటింటికీ తిరుగుతూ వివిధ పథకాలతో లబ్ధిపొందిన వారి వివరాలను కౌన్సిలర్ సంద నర్సింగ్‌తో కలిసి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో 260 మందికి ఆసరా పింఛన్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 150 మందికి లబ్ధి చేకూరిందన్నారు. గతంలో బీసీ రుణాలు రూ.50వేల చొప్పున 80 మందికి ఇచ్చామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ కింద 10 మందికి వైద్యఖర్చులకు సాయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే ఎన్నికలో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలకు మరింత సంక్షేమ, అభివృద్ధి చేకూరుతుందన్నారు. వారి వెంట వార్డు అధ్యక్షుడు ఎన్ ఆశన్న, ప్రధాన కార్యదర్శి సంతోష్, కార్యకర్తలు ఉన్నారు.

## 24 నుంచి శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల జాతర ప్రారంభం



శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం

జైనథ్, నవంబర్ 19 : కార్తీక మాసంలో జైనథ్ శ్రీలక్ష్మీనారాయణ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం కార్తీక శుద్ధ ద్వాదశి శుక్రవారం రాత్రి 8 గంటలకు వైభవంగా నిర్వహించబడును. డిసెంబర్ 1న సాయంత్రం 5 గంటలకు రథోత్సవ మహోత్సవం (పెద్ద రథం) ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఈవో వామన్ తెలిపారు.

## జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా నితిన్



నితిన్ కేపాటిల్‌కు పూల మొక్కను అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 19: సెలవుపై వెళ్తున్న జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు గణేశ్ బాపురావ్ పాటిల్ స్థానంలో నితిన్ కే పాటిల్‌ను ఎన్నికల కమిషన్ నియమించింది. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ గెస్ట్ హౌస్‌లో నూతన సాధారణ పరిశీలకులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు.

## భక్తి శ్రద్ధలతో రాజశ్యామల, చండీ యాగం

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 19 : ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న నివాస ప్రాంగణంలో రాజశ్యామల, చండీ యాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా హోమాది క్రతువులను చేపట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థి కుటుంబ సమేతంగా హోమంలో పాల్గొన్నారు. మూడు రోజులుగా చేపడుతున్న యాగంతో ఎమ్మెల్యే నివాసంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం ముగింపు సందర్భంగా పలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కుటుంబీకులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

# కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెప్పాలి

- ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న
- అర్లి, జందాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఆదిలాబాద్‌రూరల్ : అర్లి గ్రామంలో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 19 : నల్ల వ్యవసాయ చట్టాలు తెచ్చి రైతుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్న చరిత్ర కలిగిన బీజేపీకి, వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందన్న భావనలో ఉన్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చి అన్నదాతను రాజు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు పలకాలని, కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి బాటలో నడవాలని పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లి, జందాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జోగు రామన్నకు డప్పుచప్పుళ్ల నడుమ ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులతో ఆప్యాయంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చేసిన ఆందోళనల్లో వందలాది మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న రైతుల ఆందోళనపై కార్లను ఎక్కించడంతో నలుగురు మరణించారని అన్నారు. రైతుల ప్రాణాలు బలిగొన్న తర్వాత కేవలం క్షమాపణలతో ప్రధాని సరిపెట్టుకున్నారని పేర్కొన్నారు. అటు కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందన్న భావనలో ఉన్నారని, ఆ పార్టీ నేతలు ఇటీవల రైతుబంధు నగదును నిలిపివేయాలని ఈసీకి ఫిర్యాదు చేయడం రైతు సంక్షేమంపై వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. అన్నదాతలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూస్తున్న సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు పలికి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 19 : ఆదిలాబాద్ రూరల్ మండలం అర్లి గ్రామానికి చెందిన ఆకుల నవీన్, జందాపూర్‌కు చెందిన చిలుకూరి రామన్న ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం



ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఎదులాపురం, నవంబర్ 19 : అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ పట్టణంతో పాటు రూరల్ ప్రాంతానికి చెందిన పలువురు గ్రామస్తులు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి ప్రభుత్వ ఏర్పాటు కాగానే మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేసేలా సీఎ కేసీఆర్ ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ తో పాటు నిత్యావసర సరుకులు, డీజిల్ ,పెట్రోల్ ధరలను గణనీయంగా పెంచి మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం మోపిందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రతి కుటుంబానికి అండగా నిలిచేలా సీఎం కేసీఆర్ పేదలకు రూ.400కు గ్యాస్, సౌభాగ్యలక్ష్మి ద్వారా రూ.3వేలు, ప్రతి కుటుంబానికి రైతు బీమా తరహాలో రూ.5 లక్షల బీమా, షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు పేదలకు అండగా నిలబడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, సీనియర్ నాయకుడు యూనిస్ అక్బనీ, నాయకులు జంగుపటేల్, సత్యనారాయణ, గంగాధర్, దాసరి రమేశ్ పాల్గొన్నారు.

## మాల ఉపకులాల జాయింట్ యాక్షన్ కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 19 : జిల్లా కేంద్రం కైలాస్‌నగర్‌లోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జేఏసీ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీసుకుంటున్న చర్యలను ఖండిస్తూ తీర్మానించారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభలో దేశ ప్రధాని ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఒక వర్గానికి మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏకగ్రీవంగా మాల ఉపకులాల జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జేఏసీ కమిటీ కన్వీనర్‌గా అల్లూరి భూమన్నను ఎన్నుకున్నారు. కోశాధికారిగా అర్ష రమేశ్, సాయిబాబా, కోకన్వీనర్లుగా రత్నజాడే ప్రజ్ఞకుమార్, దుర్గే నారాయణ, కుర్మే లక్ష్మణ్, బొజ్జ రవి, రాజారెడ్డి, బాబా సాహెబ్ కాంబ్లే, మస్కే రాజు, శోభాతాయి, సుభాష్, ప్రజ్ఞశీల్, శశకాంత్, తొగరి భాస్కర్, కాంతారావ్ వాఘ్మరే, అర్ష దేవీదాస్, భూమన్న, సత్యనారాయణ, ప్రశాంత్, కిరణ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలన బహుజనులకు సురక్షితం



ఖంపూర్‌లో ప్రచారం చేస్తున్న సచిన్‌బావుసాతే

నార్నూర్, నవంబర్ 19 : తెలంగాణ రాష్ట్ర బహుజనులకు సురక్షితమైన పాలనను బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్నదని సాహిత్య సామ్రాట్ అన్నాభావుసాతే మనుమడు సచిన్ భావుసాతే అన్నారు. ఆదివారం నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మదాపూర్, ఖంపూర్, లోకారి(బీ) గ్రామాల్లో నిర్వహించిన లాహుజీ సాల్వే జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. మహనీయుల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మాతంగ్ సమాజ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70ఏళ్లుగా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు బహుజనులను పట్టించుకోలేదని, ఈ పార్టీలు అధికారంలోకి వస్తే దొరల పాలనను అవలంబిస్తాయన్నారు. పదేళ్లల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ పథకాలు అమలు చేశారన్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు సురక్షితమైన పాలన అందిస్తారన్నారు. కాంగ్రెస్, బీజేపీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మాతంగ్ సమాజ్ ఐక్య మత్యంతో కారు గుర్తుకు ఓటు వేసి ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలు తప్పకుండా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాన్నారు. కార్యక్రమంలో అన్నాభావుసాతే సంఘం జిల్లా అధ్యక్షుడు కాంబ్లే ఉదయ్, మాజీ జడ్పీటీసీ జ్ఞానోబాపుష్కర్, దళిత సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, ఎంపీటీసీ ఏత్మాబాయిధర్మ, నాయకులు సయ్యద్‌ఖాసీం, షేక్ దాదేఅలీ, సూల్తాన్‌ఖాన్, అలాబ్‌ఖాన్, హన్మంత్‌రావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

నేరడిగొండ, నవంబర్ 19 : మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హన్మంతు(28) అనే కూలీ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం. హన్మంతు పటేల్ కేఎన్ఆర్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆదివారం బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద పని చేస్తుండగా వేగంగా వచ్చిన కారు హన్మంతుని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన హన్మంతు అక్కడికక్కడే మృతి చెందాడు. హన్మంతు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ చిట్టాపూర్‌కు చెందిన వాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.